

# ఆషీర్ కు ఆయువు పోసిన ఖమ్మం వైద్యులు

- పసివాడి పాలబుగ్గలపై కన్నీటి ధారికను తుడిచిన డా. ప్రదీప్ బృందం
- మరోసారి మానవత్వం చాటుకున్న చిల్డ్రన్స్ స్పెషలిస్టు
- ఆ కుటుంబంలో అంతులేని ఆనందం నింపిన దార్శనికుడు
- రూ. 7 లక్షల ఆపరేషన్... అతి తక్కువ ఖర్చుతోనే
- ఖమ్మం కూరపాటి హాస్పిటల్‌లో బాలుడికి బ్రెయిన్ ట్యూమర్ సర్జరీ సక్సెస్
- మానవత్వం చాటుకున్న చైర్మన్ డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్
- ఆపరేషన్ జరిగిన 72 గంటల్లోనే నడిచిన చిన్నారి ఆషీర్

వనం నాగయ్య, కెరటం న్యూస్

మేమున్నామంటూ ఖమ్మంలోని ప్రముఖ కూరపాటి చిల్డ్రన్ అండ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ మరోసారి మానవత్వాన్ని చాటుకుంది. హైదరాబాదులోని కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఏడు లక్షల రూపాయల వరకు ఖర్చయ్యే సంక్లిష్టమైన బ్రెయిన్ ట్యూమర్ శస్త్రచికిత్సను, అత్యంత తక్కువ ఖర్చుతోనే విజయవంతంగా పూర్తి చేసి ఆ చిన్నారికి పునర్జన్మ ప్రసాదించింది.

**ఫిట్స్‌తో చేరిక... పరీక్షల్లో ట్యూమర్ గుర్తింపు**

ఖమ్మం జిల్లా తల్లంపాడు గ్రామానికి చెందిన జి.ఆషీర్ అనే బాలుడు తీవ్ర అనారోగ్యంతో ఈ నెల 12వ తేదీన కూరపాటి చిల్డ్రన్ అండ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో చేరాడు. బాలుడికి వరుస గా ఫిట్స్ వస్తుండటంతో వైద్యులు వెంటనే అప్రమత్తమై సిటీ స్కాన్ నిర్వహించారు. ప్రాథమి కంగా బ్రెయిన్ ట్యూమర్ ఉన్నట్లు గుర్తించిన డాక్టర్లు, మరింత లోతుగా పరిశీలించేందుకు ఎంఆర్ఐ స్కాన్ చేయించారు. ఇందులో బాలుడి మెదడు లోపలి భాగంలో ట్యూమర్ ఉన్నట్లు నిర్ధారణ అయింది.

**రూ. 7 లక్షలు అవుతుందనడంతో దిక్కుతోచని స్థితిలో...**

ఈ ఆపరేషన్ చేయడానికి హైదరాబాద్‌లో రూ. 7 లక్షల వరకు ఖర్చవుతుందని తెలియడంతో, అంత స్తోమత లేని బాలుడి తల్లిదండ్రులు చేతులెత్తేశారు. చివరకు దిక్కుతోచని స్థితిలో కూరపాటి చిల్డ్రన్ అండ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్‌ను ఆశ్రయించి తమ ఆవేదనను వెలిబుచ్చారు. బాధిత కుటుంబ పరిస్థితిని చూసి చలించిపోయిన డాక్టర్ ప్రదీప్ కుమార్ లాభాపేక్ష పక్కన పెట్టి, అత్యంత తక్కువ ఖర్చుతో ఇక్కడే సర్జరీ చేపించాలని నిర్ణయించారు.

**రంగంలోకి నిపుణుల బృందం**

ఈ నెల 14వ తేదీన డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్ పర్యవేక్షణలో నిపుణులైన వైద్య బృందం రంగంలోకి దిగింది. ప్రముఖ పీడియాట్రిక్ న్యూరో సర్జన్ డాక్టర్ తరంగ్ వోరా, అనస్తీసియా నిపుణులు డాక్టర్ రవి కుసుమరాజు, చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ బ్రహ్మ కుమార్, ఓటి టెక్నీషియన్స్ రవి, అభిరామ్‌లు కలిసి అత్యంత సంక్లిష్టమైన ఈ శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేసి ట్యూమర్‌ను తొలగించారు. అద్భుతమైన ఈ సర్జరీ ముగిసిన కేవలం 72 గంటల్లోనే బాలుడు పూర్తి కోలుకునినడవడం విశేషం. ప్రస్తుతం బాలుడు పూర్తి ఆరోగ్యంగా ఉన్నాడని హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ ప్రదీప్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా అరుదైన సర్జరీని సక్సెస్ చేసిన వైద్య బృందాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.



